ఆదర్శ నియోజకవర్గంగా గాజువాక

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 68వ వార్డులో రూ.3.75 కోట్లతో అభివృద్ధి పనులు
- చిల్డ్రన్‌పార్క్, ఓపెన్ జిమ్‌ల ప్రారంభోత్సవం
- సీసీ రోడ్లు, మింది చెరువు అభివృద్ధి తదితర పనులకు శంకుస్థాపనలు


గుడివాడ అప్పన్నకాలనీలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాక నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అన్నారు. జీవీఎంసీ 68వ వార్డులో రూ.3.75కోట్లకు సంబంధించిన పనులకు కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో 95 శాతం అభివృద్ధి జరిగిందని, పెండింగ్ పనులు ఉంటే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఓటమి భయంతోనే చంద్రబాబు అలజడులు

ముఖ్యమంత్రి జగన్ పరిపాలనలో చరిత్ర సృష్టిస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని అభివృద్ధి జగన్ ప్రభుత్వంలో జరుగుతోందన్నారు. సుభిక్షంగా ఉన్న రాష్ట్రంలో చంద్రబాబు కావాలనే అలజడులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటమి భయంతో చంద్రబాబు రాష్ట్రంలో సృష్టిస్తున్న అరాచకాలను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. చంద్రబాబు అనుచరులు చేసిన దాడిలో పోలీసులు తీవ్ర గాయాలపాలైనా పవన్‌కల్యాణ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

వారి సహకారం ఎనలేనిది

68వ వార్డు అభివృద్ధికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అందించిన సహకారం ఎనలేనిదని కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. అందరి సహకారంతో వార్డులో సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు వరదాడ వెంకటరమణ, సంధ్రాన నూకరాజు, పోలవరపు శ్రీహరి, నంబారు రాజు, ఈటి సురేష్, బోనెల జోసెఫ్, గుర్రం రాజేష్, నేలపాటి సత్యవతి, శ్యాంబాబు, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు

- మిందిలో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్
- అక్కిరెడ్డిపాలెంలో రూ.5 లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ అనూష సోమవారం ప్రారంభించారు.

శంకుస్థాపన చేసిన పనులు

- మింది శ్మశానవాటికలో రూ.49.5 లక్షలతో నిర్మించనున్న బర్నింగ్ షెడ్ నిర్మాణం
- గుడివాడ అప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్, కాళికానగర్, రాంనగర్‌లలో రూ.48 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సీసీ కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు
- మింది బస్టాప్ వద్ద గల మింది ఐడియల్ స్కూల్ వీధిలో రూ.36 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజీల పనులు
- రూ.39.70 లక్షలతో చేపట్టనున్న గుడివాడ అప్పన్నకాలనీ, అక్కిరెడ్డిపాలెం, రాంనగర్‌లలో ధోబీఖానాల అభివృద్ధి, ప్రహరీ గోడల నిర్మాణం
- రూ.42 లక్షల వ్యయంతో మింది చెరువు అభివృద్ధి
- రూ.1.42 కోట్లతో అక్కిరెడ్డిపాలెం చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.


మిందిలో చిల్డ్రన్ పార్కు ప్రారంభించి, ఊయల ఊగుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

పుంగనూరు ఘటనకు చంద్రబాబే కారకుడు


మానవహారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, నాయకులు

- ఆవేశపూరిత వ్యాఖ్యలతో కార్యకర్తలను రెచ్చగొట్టారు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆగ్రహం
- పెదగంట్యాడ జంక్షన్ వద్ద నిరసన

పెదగంట్యాడ: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే చిత్తూరు జిల్లా పుంగనూరులో వివాదం చోటుచేసుకుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు ఉసిగొల్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు ఘటనను నిరసిస్తూ పెదగంట్యాడ జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి సోమవారం మానవహారం నిర్వహించారు. చంద్రబాబు తీరుపై నిరసన తెలిపారు. అనంతరం టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమి భయంతోనే చంద్రబాబు విధ్వంసకాండకు తెగబడ్డారని, విధ్వంసాలు సృష్టించడం ఆయనకు కొత్తేమీ కాదని అన్నారు.

ప్రాంతాల మధ్య చిచ్చు

కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఇస్తామన్న హామీని ఆయన అమలు చేయలేదన్నారు. సీమకు తీవ్ర అన్యాయం చేయడమే కాక టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు వేయించుకోవాలని కలలుగంటున్నాడన్నారు. నలభైయేళ్ల రాజకీయ అనుభవమని చెప్పుకొనే చంద్రబాబు ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చలా తయారయ్యారని మండిపడ్డారు. 14 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబుకి ప్రస్తుతం ప్రజల్లో ఆదరణ లేక కుట్రపూరిత రాజకీయాలకు తెర తీస్తున్నాడన్నారు. పదవి కోసం ఎన్ని కుట్రలు, కుయుక్తులకు పాల్పడినా ప్రజలు గమనిస్తున్నారన్నారు. పుంగనూరులో విధ్వంసకాండకు చంద్రబాబు పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వారాహి, యువ గళం, సాగునీటి ప్రాజెక్టుల సందర్శన పేరుతో రాష్ట్రంలో అలజడి సృష్టిస్తున్నారన్నారు. వారి సమావేశాలకు ప్రజలు రాకపోవడంతో విధ్వంసకాండలకు పాల్పడుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న ఆంధ్ర రాష్ట్రంలో అసాంఘిక కార్యక్రమాలను పెంచి పోషిస్తున్న చంద్రబాబును రాష్ట్రం నుంచి బహిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో 85 శాతం మంది ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో 25మంది ఎంపీలు, 175మంది ఎమ్మెల్యేలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, బొడ్డు నరసింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు మార్టుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, కోమటి శ్రీను, దొడ్డి రమణ, బోగాది సన్నీ, గుడివాడ లతీష్, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, వెంపాడ అప్పారావు, మంత్రి శంకరనారాయణ, సంపంగి ఈశ్వరరావు, రోజారాణి, కొయ్య భారతి, యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


మృతుని భార్యకు బీమా సొమ్ము అందిస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చినఅక్కిరెడ్డిపాలెంలో మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణసాయాన్ని అందజేశారు. చినఅక్కిరెడ్డిపాలెం సచివాలయ పరిధిలో నివసిస్తున్న కాదా వెంకటరావు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా వర్తించింది. దీంతో తక్షణసాయం కింద మంజూరైన రూ.10వేలను మృతుడి భార్య లావణ్యకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ సత్యనారాయణ, అడ్మిన్ సెక్రటరీ రేఖ పాల్గొన్నారు.

స్పందనకు 25 వినతులు


వినతులను స్వీకరిస్తున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: గాజువాకలోని వివిధ సమస్యలపై గాజువాక జోనల్ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జెడ్సీ సింహాచలం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పార్కు నిర్మించాలని, పెరిగిన ఆస్తి పన్నును తగ్గించాలని, అనధికార నిర్మాణాలను తొలగించాలని కోరుతూ వినతులు సమర్పించారు. మొత్తం 25 ఫిర్యాదులు, వినతులు అందినట్టు జెడ్సీ తెలిపారు.

పోర్టు కార్మికుల సమస్యలపై యాజమాన్యం స్పందించాలి

పెదగంట్యాడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అదానీ గంగవరం పోర్టు కార్మికులు 35 రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం సరికాదని 75వ వార్డు కార్పొరేటర్ పులి ఝాన్సీ లక్ష్మీబాయ్ అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షా శిబిరాన్ని సీతానగరం గ్రామస్తులతో కలసి సోమవారం ఆమె సందర్శించారు. కార్మికులకు రూ.6వేల ఆర్థిక సాయం అందజేశారు.

శ్రీకాంత్‌కు 'కవి సార్వభౌమ' బిరుదు ప్రదానం


శ్రీకాంత్‌కు బిరుదు ప్రదానం చేస్తున్న అతిథులు

గాజువాక: స్థానిక కలం స్నేహితుల కళావేదిక సభ్యుడు, సహజ కవి డబ్బీరు శ్రీకాంత్‌కు హైదరాబాద్‌కు చెందిన లలిత కళా సమాఖ్య ప్రతినిధులు కవి సార్వభౌమ బిరుదును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ బిరుదును ప్రదానం చేసినట్టు గాజువాక శిష్టకరణ సమాఖ్య అధ్యక్షుడు బలివాడ సత్యారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు సమాఖ్య నాయకులు కె.గౌరీ ప్రసాద్, డి.గోవిందరావు, బి.తిరుపతిరావు తదితరులు అభినందనలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పెంచిన ఈడీఎల్‌ఐ వర్తింపునకు వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పెంచిన ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఈడీఎల్‌ఐ)ను చనిపోయిన కార్మికులకు చెల్లించే ఏర్పాటు చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ నుంచి ప్లాంట్ లోపలి పే సెక్షన్‌కు బదిలీపై వచ్చిన డీజీఎం ఎస్.రామప్రసాద్‌ను నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈడీఎల్‌ఐ 2020సంవత్సరం నుంచి రూ.7 లక్షలు చేసినా, ఇప్పటి వరకు రూ.4.5 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, గోపి నారాయణ,నాయుడు, రమణమూర్తి, వెంకటపతి రాజు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు


75వ వార్డులో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మీభాయ్

కూర్మన్నపాలెం: తల్లీపిల్లల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు తెలిపారు. 87వ వార్డులో టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. నాయకులతో కలసి గర్భిణులు, బాలింతలకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, జెర్రిపోతుల ఈశ్వరరావు, చిత్రాడ వెంకటరమణ, కోమటి రమాదేవి, ఆడారి శ్రీను, ప్రగడ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డులో..

పెదగంట్యాడ: నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ పథకం కింద టేక్ హోం రేషన్ కిట్లను కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ సోమవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సంపూర్ణ పోషణ కిట్లతో గర్భిణులు, బాలింతలకు పూర్తి ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పోషకాహారం తీసుకోవడానికి గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఇంటికే పోషకాహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేపై జెడ్సీ పరిశీలన


ఓటర్లతో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

గాజువాక: గాజువాక నియోజకవర్గంలోని ఇంటింటా నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేను సహాయ ఓటర్ల నమోదు అధికారి, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం సోమవారం పరిశీలించారు. గాజువాకలోని వివిధ ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌ల పరిధిలో సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. 71వ వార్డులోని 124 పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్లను కలిసి ఓటర్ల నమోదులో వారి అర్హతలను పరిశీలించారు. బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సిద్ధార్థనగర్ సమస్యపై వినతి


'జగనన్న చెబుదాం' కార్యక్రమంలో వినతిపత్రం అందజేస్తున్న కాలనీ సంఘం నాయకులు

గాజువాక: వడ్లపూడి దరి సిద్ధార్థనగర్‌ను 22ఏ జాబితా నుంచి తొలగించాలని ఈ కాలనీ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, జె.ఎస్.మూర్తి తదితరులు జిల్లా కలెక్టర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. బీహెచ్‌పీవీ హౌస్ బిల్డింగ్ సొసైటీ ద్వారా వడ్లపూడి సర్వే నంబర్ 1/5లోని తొమ్మిది ఎకరాల్లో సిద్ధార్థనగర్‌ను నిర్మించారన్నారు. 1991లో ప్రభుత్వానికి అప్పటి ధరను చెల్లించి వుడా ఆమోదం ద్వారా 264 ఇళ్లను నిర్మించారన్నారు. అప్పట్లో ఇళ్లు కొనుక్కున్న ఉద్యోగులంతా ప్రస్తుతం రిటైరైపోయారని, తమ ఇళ్లను వారసులకు 2017 వరకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని పేర్కొన్నారు. 2017 తరువాత కాలనీ మొత్తాన్ని 22ఏ జాబితాలో నమోదు చేయడం వల్ల ఇళ్ల యజమానులు తమ అవసరాలకు విక్రయించుకోలేకపోతున్నారని, వారసులకు బదిలీ చేసుకోలేకపోతున్నారని తెలిపారు.ఈ సమస్యను పరిష్కరించాలని, 22ఏ జాబితా నుంచి తొలగించాలని కోరారు. వినతిపత్రం సమర్పించినవారిలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శంకర్‌నాయక్, టి.సత్యనారాయణ, కృష్ణ నాయక్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు ఢిల్లీలో నేతలకు వినతి


ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలో కొనసాగేలా కేంద్రంపై ఒత్తిడి చేసి, తెలుగు ప్రజల ఆకాంక్షను కాపాడాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. నాయకులు సోమవారం ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్, జేడీ(యు) కేంద్ర కార్యదర్శి మహ్మద్ నిస్సార్‌లను ఢిల్లీలో కలిసి ఈ మేరకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, డి.వి.రమణారెడ్డి, కరణం సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు. అనంతరం జంతర్‌మంతర్ వద్ద పోలవరం అంశంపై జరిగిన ధర్నాలో పాల్గొని, వారికి సంఘీభావం తెలిపారు.

ఘనంగా ముగిసిన విస్కా సాంస్కృతికోత్సవాలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం శర్మ

ఉక్కునగరం: విశాఖ స్టీల్ కల్చరల్ అసోసియేషన్ (విస్కా) సాంస్కృతికోత్సవాలు ఘనంగా ముగిశాయి. విస్కా ప్రారంభమై 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన నాటిక ప్రదర్శనతో ముగిశాయి. స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ జీఎం ఆర్.పి.శర్మ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నలభై ఏళ్లు ఒక సంస్థను నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా చైతన్య కళాస్రవంతి ప్రదర్శించిన 'గుడి ఎనక నాసామి' నాటిక అలరించింది. కార్యక్రమంలో విస్కా ప్రతినిధులు నేమాని శర్మ, ఎ.కేశవరావు, వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ ఎస్.కృష్ణబాబు, సభ్యులు మోదేకుర్తి సత్యనారాయణ, జి.ఆర్.కె.శర్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల విజేత విశాఖ


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్, కరణంరెడ్డి

పెదగంట్యాడ: ఆంధ్ర షోటోకాన్ కరాటే డు అసోసియేషన్ ప్రతినిధులు పోలరాజు, సునీల్ ఆధ్వర్యంలో బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణమండపంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి మొత్తం 600 మంది పాల్గొన్నారు. విశాఖ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, శ్రీకాకుళం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. కాకినాడ జట్టు మూడో స్థానాన్ని సాధించారు. విజేతలకు సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, తాతారావు, శ్రీనివాసరావు, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పద్మమార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: జాతీయ చేనేత దినోత్సవాన్ని అగనంపూడి శ్రీపద్మశాలి మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో అగనంపూడి పెదమడకలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు మాట్లాడుతూ చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రతీ మండలంలో చేనేత భవనం ఏర్పాటు చేయాలని, చేనేత వృత్తి సాగించే పద్మశాలీలకు కల్యాణ మండపం నిర్మించాలని కోరారు. చేనేత వృత్తి సాగించే కార్మికులకి రుణ సౌకర్యం కల్పించాలని, ఈ విషయమై ఈ నెల 27వ తేదీన విశాఖ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నామని తెలిపారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వే కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు, జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పల రామ్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీపద్మ మార్కండేయ లలిత సేవా సంఘం అధ్యక్షురాలు పచ్చారి ప్రభావతి, పెదమడక పద్మ మార్కండేయ సేవా సంఘం కార్యదర్శి బేతా హనుమంతురావు, ప్రతినిధులు గంధోళి వెంకటరమణ, నరసింగరావు, రామలక్ష్మణ్, రమేష్, ప్రసాద్ వరలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- చేనేత దినోత్సవం సందర్భంగా అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, బాలలు చేనేత వస్త్రాలు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థులకు చేనేత వస్త్రాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారం డ్రైనేజీపాలు



అక్కిరెడ్డిపాలెం: మిగిలిపోయిన ఆహారాన్ని నిర్వాహకులు డ్రైనేజీలో వేయడంతో స్థానికులు విమర్శిస్తున్నారు. అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా గల మైదానంలో ఆదివారం రాత్రి ఓ ఫంక్షన్ నిర్వహించారు. కార్యక్రమంలో మిగిలిన బిర్యానీ, ఇతర పదార్థాలను స్కూల్ పక్కనే డ్రైనేజీలో పడేశారు. ఆహారాన్ని ఆకలితో అలమటించే అభాగ్యులకు ఇస్తే ఆనందంగా తినేవారని స్థానికులు నిట్టూరుస్తున్నారు. ఒకవేళ వ్యర్థాలైతే డస్ట్‌బిన్‌లో వేయకుండా, కాల్వలో వేయడంపై శానిటరీ సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కూర్మన్నపాలెం: గత విద్యాసంవత్సరంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సంపాదించుకున్న కణితి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఐదుగురికి లయన్స్ క్లబ్ నగదు ప్రోత్సాహకాలు అందించింది. విద్యార్థులు స్వరూపాంజలి, జె.నందకిశోర్, ఇల్లపు సోనియా, మహరాజు లలిత, ధరణి నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. వారికి పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ లయన్స్ క్లబ్ సహకారంతో రూ.2వేల చొప్పున నగదుతో పాటు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, ట్రెజరర్ సీతారామరాజు, సభ్యులు శంకరరావు, ప్రసాద్, మానవత సేవా ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, పీడీ మన్నాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బయ్యే మల్లయ్య, బి.తాడన్న కోరారు. అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆదివాసీ దినోత్సవం బ్రోచర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ స్థానిక అంబేడ్కర్ కళాక్షేత్రంలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో థింసా, బంజారా, ఓరాన్ నృత్యం, సంతాలి, కోయ తదితర నృత్యాలు ప్రదర్శించనున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, అసోసియేషన్ సభ్యులందరూ కుటుంబాలతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్. సత్యనారాయణ, ఎం.మోహన్‌బాబు, డి.పుల్లారావు, ఎల్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు


గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ప్రజా గాయకుడు గద్దర్ మృతి రెండు రాష్ట్రాలకు తీరని లోటని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గద్దర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, సంపూర్ణం, ధర్మాల శ్రీను, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు ఉత్పత్తికి ఆటంకం సరికాదు'


దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఉత్పత్తిపరంగా ఆటంకాలను సృష్టించడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక శక్తిని అణగదొక్కే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని హెచ్చరించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 907వ రోజు సోమవారం ఆర్ఎంహెచ్‌పీ, ఆర్ఈడీ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ముందుగా ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గద్దర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, నీరుకొండ రామచంద్రరావు, ఆర్ఎంహెచ్‌పీ, ఆర్ఈడీ విభాగ ప్రతినిధులు శ్రీనివాస్, బి.ఎస్.రాజు, జయ, బొట్టు శ్రీను, పట్టా రమేష్, కార్మికులు పాల్గొన్నారు